



కోలేదు. దానికి కారణాలున్నాయి. ఒకటి— వెంకట్రామయ్య తక్కువకులంవాడు. రెండు వెంకట్రామయ్య గెలవటానికి అవకాశాలు లేవు. మూడు సుదర్శన రెడ్డి తనకు దగ్గిరవాడు. నాల్గు తనకు హైలెవల్‌లో సుదర్శనరెడ్డి సహకరించగలడు.

"మన ఊరు మంచికోసం నారాయణరెడ్డికి ఓట్లు వేయాలని నిర్ణయించాను. మీరంతా దీనికి కట్టుబడి వుండాలి."

ఎవ్వరూ ఏమీ అనలేదు.

వెంకట్రామయ్య ప్రచారకులు ఊరులోకి ఒకసారి వచ్చారు. వారిని బెదిరించారు. వారు వెళ్ళిపోయారు.

మళ్ళీ ఎవ్వరూ రాలేదు.

పోలింగ్ నాలుగు రోజులుందనగా మళ్ళీ ఊరునంతా పిలిచాడు.

"మొదట మీ అందరికీ చెప్పాను. నారాయణరెడ్డికే ఓటు వేయాలని—అందరూ నారాయణరెడ్డికే ఓటు వేయాలి. ఇవ్వాల్టి నుండి సారా, కల్లు దుకాణాలలో పైసలు తీసుకోబడవు. మీ యిష్టమొచ్చినంత తాగచ్చు. ఓటు మాత్రం నారాయణరెడ్డికే వేయాలి"- అని చెప్పి - మీసాలు మెలివేసి "ఇంకో మాట ఊరి సంగతి నాకుతెలుసు. ఎవరు ఎటువంటి వారో నాకు తెల్సు. ఒక్క ఓటు కూడా వెంకట్రామయ్యకు పడకూడదు. పడితే ఎవరువేసారో నేను చెప్పగలను. వాడు ఈ వూరిలో ఉండటానికి వీల్లేకుండా చేస్తాను" అన్నాడు గంభీరంగా.

ఎవ్వరూ ఏమీ అనలేదు.

* * *

పోలింగు అయిపోయింది.

ఓట్ల లెక్కింపు జరిగింది.

నారాయణరెడ్డి గెలిచాడు.

వెంకటాపురంలో వెంకట్రామయ్యకు పద్దెనిమిది ఓట్లు పడ్డాయి. సర్పంచు సుదర్శన రావు గుండెల్లో రాయి పడింది. ఒక్కటి కాదు, పద్దెన్మిది రాళ్ళు పడ్డాయి. పద్దెన్మిది ఓట్లు. ఒక్క ఓటు కూడా పడదని ఛాలెంజీ చేసాడు. అంటే - తనకు వూరిలో పద్దెన్మిది మంది ప్రత్యర్థులన్నమాట.

ఎవరు వీళ్ళు?

రాత్రి అంతా నిద్ర పోకుండా ఆలోచించాడు.

దొరికారు. పద్దెన్మిది మంది దొరికారు.

* * *

తెల్లవారింది.

సర్పంచు సుదర్శనరావు, పోలీసుపటేల్, మాలిపటేల్, కరణం, ఆ ఊరు షావుకారిని పిలిచారు. తర్వాత పద్దెనిమ్మిది మందిని పిలిచాడు. ఒక టీచర్, చాకలి వాడు, వాని భార్య. మంగళి వాడు వాని భార్య. ఇంకో ఇద్దరు, బీడీలు చేస్తున్న పదకొండు మంది హరిజనులు

అందరూ భయపడుతూ ఇంటి అరుగు మీది కొచ్చారు. అందరూ నిల్చున్నారు. సర్పంచు మొదలు పెట్టాడు.

"ఈ ఊరిలో పద్దెనిమ్మిది ఓట్లు పడ్డాయి. అంటే పద్దెనిమ్మిది మంది ప్రత్యర్థులన్నమాట. నేనంటే నచ్చని వాళ్ళు పద్దెనిమ్మిది మంది ఈ వూరిలో ఉన్నారన్నమాట. వాళ్ళు ఎవరో నేను చెప్పగలను. ఈ వూరిలో ప్రతి ఒక్కరూ, వారి గుణాలూ నాకు తెల్సు."

అని కొంచెం సేపు ఆగి అందరినీ చూచి- ఒక్క సిగరెట్టు దమ్ము పీల్చి నిల్చున్న పద్దెనిమ్మిది మందివంక వ్రేలు త్రిప్పి చూపిస్తూ "మీరంతా ఓట్లు వేశారు" అన్నాడు.

అంతా నిశ్శబ్దమయ్యింది.

"ఈ పద్దెనిమ్మిది మంది మనకు వ్యతిరేకంగా ఓటు వేశారు" అన్నాడు పోలీసు పటేల్ కరణం కూర్చున్న దిక్కు చూస్తూ.

ఎవ్వరూ ఒక్కమాట మాట్లాడలేదు.

"కాదంటారా?"—

ఎవ్వరూ కాదనలేదు

"ఈ ఊరిలో ఎవరు ఎటు వంటి వారో నాకు తెల్సు."

చాలాసేపు నిశ్శబ్దం పేరుకుంది. అందరి గుండెల్లో భయం నిండుకుంది

"ఎన్నికలకు ముందు ఒక మాట అన్నాను. ఎవరు వెంకట్రామయ్యకు ఓట్లు వేస్తారో నేను చెప్పగలను. వారిలో ఎవ్వరూ ఈ ఊరిలో ఉండటానికి వీల్లేదు."

ఐదు నిమిషాలు గడిచింది.

"ఈ ఊరిలో వుండవచ్చు. కాని టీచర్ సత్యంనుదూరాన ఎక్కడికో ట్రాన్స్‌ఫర్ ... నీవా నాయకుడివి"—

సత్యం మాట్లాడలేదు.

"చాకలి రంగనితో ఎవ్వరూ పని చేయించుకోరు. అట్లాగే మంగళి రామునితో ఎవ్వరూ పని చేయించుకోరు బీడీలు చేసే సుందరమ్మను కార్ఖానా నుండి వెళ్ళ గొడుతారు. ఈ పద్దెనిమ్మిది మందికి వూరిలో నగదు అయినా సరే ఏ సామాను ఎవ్వరూ యివ్వరు.

సత్యం హృదయం కోపంతో బుసలు కొట్టసాగింది.

బయట కొచ్చారు

అందరినీ తన వెంట రమ్మన్నాడు.

సత్యం కోపంగా వున్నాడు నడి వూరిలో వున్న దేవాలయం దగ్గరి కొచ్చాడు దేవాలయం పైకి అందరిని పిలిచాడు. చుట్టూ నిల్చున్న వారి నందరిని పిలిచాడు. దారి వెంట వెళ్తున్న వారిని పిలిచాడు ఇక చెప్పటం ప్రారంభించాడు. "మేము వెంకట్రామయ్యకు ఓట్లు వేశాం ఓటు ఎవరికైనా వేసే హక్కు మాకుంది ఈ సర్పంచు ఎవడు చెప్పటానికి? వూరిలో నుండి వెళ్ళగొడతానని బెదిరిస్తున్నాడు ఆయన దా వూరు? మీదా వూరు? ఆలోచించండి. కష్టపడుతున్నవారు మీరు. సుఖంగా జీవిస్తున్నవాడు ఆయన. వూరు మీదా ఆయనదా? ఆలోచించండి" చెపుతున్నాడు, వచ్చిన వారికెల్లా చెపుతున్నాడు. పొద్దంతా చెపుతున్నాడు.

ప్రజలు వింటున్నారు.

ఆలోచిస్తున్నారు.

వాళ్ళ గుండెల్లో ఈ ఏకఛత్రాధిపత్యానికి వ్యతిరేకంగా ఏదో మండుతోంది *